# మతాభిమానం

(గల్పిక)

ఒక వైశాఖ పౌర్ణమికి ఆ చిన్న రాజ్యానికి ఒక బౌద్ధసన్యాసి వచ్చి, బౌద్ధాన్ని మించినది మరో మతం లేదని ఒప్పించాడు. రాజుగారికి అన్నీ నచ్చాయి గాని అహింస నచ్చలేదు. అయిదురకాల మాంసం కూరలు లేకుండా ఎలా అరగించటం?

"మీరు జంతు వధ చెయ్యరాదు. వధించిన జంతువులను నిక్షేపంగా తినవచ్చు," అన్నాడు సన్యాసి. రాజు తృప్తిపడ్డాడు. సన్యాసి రాజగురువుగా ఉండిపోయాడు.

బౌద్ధం ప్రజలలో వ్యాప్తికావటానికి రాజు ఇతర మతాలమీద పన్నులు వేశాడు. అందరూ బౌద్ధం పుచ్చుకున్నారు. కటికవాళ్ళు కూడా తాము జంతువధ మానేస్తామనీ, బౌద్ధం పుచ్చుకుంటామనీ అన్నారు.

రాజు ఆందోళనచెంది, బౌద్ధ సన్యాసిని సలహా అడిగాడు. బౌద్ధ సన్యాసి మరింత ఆందోళనచెందాడు — అతగాడికి కుందేలు మాంసం మహాఇష్టం— గాని తన ఆందోళన బయటపడనీయక, "రాజా, వాళ్ళమీద పన్నులు తీసెయ్యి. బోయవాళ్ళకూ, బెస్తవాళ్ళకూ కటికలాలవాళ్ళకూ రెట్టింపు డబ్బులు ముట్టేటట్టు మాంసాదుల ధరలు పెంచు," అన్నాడు.

రాజు అలాగే చేశాడు. అయినా మాంసం సరఫరా చేసేవారు వందల సంఖ్యలో బౌద్ధం అవలంబించి, గుండ్లు గొరిగించుకుని, అహింస అవలంబించాం అన్నారు.

రాజుకూ, ప్రజలకూ వచ్చి వెలక్కాయ గొంతున పడ్డట్టయింది.

ఇంతలో ఆ దేశానికి శంకరాచార్యుల శిష్యుడు ఒకడు వచ్చి వైదిక ధర్మ ప్రచారం ప్రారంభించాడు.

"మహారాజా, ఈ వైదికుణ్ణి దేశంనుంచి పారదోలండి," అన్నాడు మంత్రి.

బౌద్ధసన్యాసి గుడ్లు ఎర్రజేసి, "మంత్రీ, తెలిసీ తెలియని సలహా చెప్పకు," అని తన సలహా రాజుకు చెప్పాడు.

తరవాత రాజబంధు వొకడు శంకరుల వారి ప్రశిష్యుడై దేశమంతటా యజ్ఞాలు జరగాలని ప్రబోధంచేశాడు. యజ్ఞాలను నిషేధిస్తూ శాసనం జరగలేదుగాని, బలిపశువులమాంసం రాజుగారిదని శాసనం జరిగింది.

తరవాత రెండేళ్ళకు ఆ దేశంలో ఒక్క బౌద్ధుడులేడు. బోలెడంతమంది బోయవాళ్ళూ, బెస్తవాళ్లూ, కటికవాళ్లూ ఉన్నారు.

---

కొడవటిగంటి కుటుంబరావు